ఆర్ఆర్ఆర్ రైతుల ముందస్తు అరెస్టు

రైతులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

కొండాపూర్, మార్చి 17: ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు పనుల అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తాం అంటూ రైతులు హెచ్చరికలు జారి చేయడంతో ప్రభుత్వం గిర్మాపూర్ భూబాధితులను సోమవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించింది. దీంతో ఆర్ఆర్ఆర్ రోడ్డు పనులు ఆపేసి, అలైన్‌మెంట్‌ను పూర్తిగా మార్చాలని రైతులు పోలీస్‌స్టేషన్‌లోనే ఆందోళన చేశారు. లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో నడుస్తున్న ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు తమ గ్రామంలో ఒక ఎకరం భూమిని కూడా ఎవరూ అమ్ముకోలేదని వారి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ప్రభుత్వం తమ భూములను అన్యాయంగా లాక్కునే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అసెంబ్లీ ముట్టడికి బయపడి ప్రభుత్వం రైతులను మందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. అలైన్‌మెంట్ మార్చే వరకు భూములు ఇచ్చేదిలేదన్నారు. కార్యక్రమంలో మల్లేశం, జయరాములు, అశోక్, లక్ష్మయ్య, గొల్ల నర్సింహులు, గొల్ల శంకర్, భారత్‌భూషన్ రాములు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

తారా కళాశాల ఆవరణలో సేకరించిన ప్లాస్టిక్‌తో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి17: ప్లాస్టిక్‌ను వాడడం వల్ల పర్యావరణం దెబ్బతింటున్నదని, భావి తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వృక్షశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో స్వచ్ఛతా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలోని చెత్త, ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిస్లరీ కంపెనీ పైవేట్ ఇండియా సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలిగించామన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అనంతరం విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ జగదీశ్వర్, నిర్మల, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రో గ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనులు ప్రారంభం

పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, మార్చి17: ఆర్సీపురం డివిజన్ కాకతీయనగర్ కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టనున్న నాలా పూడికతీత పనులను సోమవారం కార్పొరేటర్ పుష్పానగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వచ్చే మురుగు ఈ నాలా నుంచి నక్కవాగులో కలుస్తుందన్నారు. లింగంపల్లి నుంచి ఇసుకబావి వరకు నాలాలో పూడికతీత పనులను ప్రారంభించామని, నాలాలో చెత్తాచెదారాన్ని తొలిగిస్తే వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు దోహదపడుతుందని తెలిపారు. కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌బాబు, ప్రవీణ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలంబాట పట్టిన విద్యుత్ అధికారులు

పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ ఏడీఈ దుర్గాప్రసాద్

జిన్నారం, మార్చి 17: మండలంలోని నల్తూర్, కొర్లకుంట, కిష్టయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ...రైతులు మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల మోటర్లు కాలిపోకుండా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా ఉంటుందని, లోఓల్టేజీ సమస్య లేకుండా మెరుగవుతుందన్నారు. విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బంది పడకుండా కెపాసిటర్లు చూస్తాయని తెలిపారు. విద్యుత్ సిబ్బంది రైతులకు స్నేహ పూర్వకమైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, లైన్మెన్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పటాన్‌చెరు, మార్చి 17: పటాన్‌చెరు నుంచి ఇస్నాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులను వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇస్నాపూర్‌లో నివసించే మింటు గిరి(32), ఆయన భార్య రమాదేవి(28), వారి కుమారుడితో కలిసి పటాన్‌చెరు వెళ్లి తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. ఇస్నాపూర్ సమీపంలో ట్రెండ్స్ ముందున్న యూటర్న్ వద్దకు రాగానే వెనకనుంచి వచ్చిన టిప్పర్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మింటుగిరి, వారి అబ్బాయి ఒకవైపు పడిపోగా, రమాదేవి టిప్పర్ వైపు పడటంతో టిప్పర్ ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి ఘటన స్థలంలోనే మృతి చెందింది. భర్తకు, కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యం

జహీరాబాద్, మార్చి 17: ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యమైన ఘటన చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్వాతపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం..మొగుడంపల్లి మండలంలోని పర్వాతపూర్‌కు చెందిన గురిడి గోపాల్‌రెడ్డి (38), అతడి కూతురు తనూషరెడ్డి(8), కుమారుడు సాత్విక్‌రెడ్డి(7) కలిసి జనవరి 17న సంగారెడ్డికి వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేదు. వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా సమాచారం లభించలేదు. మూడు నెలలుగా పిల్లలతో సహా తండ్రి అదృశ్యం కావడం అంతుపట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సోమవారం గోపాల్‌రెడ్డి తల్లి శోభమ్మ ఫిర్యాదు మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కంగ్టి, మార్చి 17: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంగ్టి మండలం భీంరాలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంగ్టి మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పోగుల సుజాత, రవీందర్‌రెడ్డి దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉండగా వారిలో రెండో కూతురు మహేశ్వరి(22)ని మండలపరిధిలోని భీంరాకు చెందిన బోండ్ల పండరిరెడ్డికి ఇచ్చి మూడేండ్ల క్రితం పెండ్లి చేశారు. కొన్ని రోజులుగా భర్త పండరిరెడ్డితోపాటు మామ గంగారెడ్డి, బావ బసిరెడ్డి కట్నం కోసం వేధిస్తున్నారని చెప్పారు. నిన్నరాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగ్గా ఉదయం 6 గంటలకు ఇంట్లో ఉన్న దూలానికి మహేశ్వరి దోతితో ఉరి వేసుకొని మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నవాడికి 3 నెలల వయస్సు ఉంది. మృతురాలు తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఘటనా స్థలాన్ని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశీలించి ఇరుగుపొరుగు వారిని విచారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నారాయణఖేడ్ దవాఖానకు తరిలించారు.

సెల్ రిపేర్‌కు డబ్బు �ివ్వలేని...

అందోల్, మార్చి 17: సెల్ రిపేరుకు భార్య డబ్బుల్విికపోవడంతో మద్యం మత్తులో గడ్డి మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తాలెల్మలో సోమవారం జరిగింది. జోగిపేట ఎస్సై పాండుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాగయ్య(40) కూలిపనులు చేస్తూ భార్య కిష్టమ్మతో కలిసి ఉంటున్నాడు. మద్యం మత్తులో ఉన్న బాగయ్య పాడైన ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు రూ.3వేలు ఇవ్వాలని భార్యను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగి ఆగ్రహంతో బాగయ్య గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వం ఆశ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

కొండాపూర్: తహసీల్దార్ అనితకు వినతి పత్రం అందజేస్తున్న ఆశలు

సదాశివపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశలు

కోహీర్ తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

డిమాండ్లు పరిష్కరించాలని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లు ధర్నాలు నిర్వహించడంతోపాటు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. మూడేండ్ల నుంచి రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆశ వర్కర్లకు రూ.18,000 వేతనం ఇస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చి పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా నేటికీ వేతనాలు పెంచలేదన్నారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పనిభారం తగ్గించాలన్నారు. కనీస వేతనాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

న్యూస్ నెట్‌వర్క్, సంగారెడ్డి, మార్చి 17

జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్న చేస్తున్న ఆశలు

ఝరాసంగం తహసీల్దార్ వినతి పత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

అందోల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

హత్నూర తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

ప్రజావాణికి 54 అర్జీలు

స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి17: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 54 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్, డీఆర్వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో జిల్లాలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో చేతి పంపులు, పబ్లిక్ వాటర్ సప్లై సిస్టం, మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా పరిశీక్షించి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

స్వామివారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి, రాములుగౌడ్

దైవచింతన అలవర్చుకోవాలి

రామచంద్రాపురం, మార్చి 17: ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి, బీరప్ప స్వామి జాతర మహోత్సవంలో బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి, రాములు గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు నేతలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ నాగులపల్లిలో మల్లన్న, బీరప్ప స్వామి జాతర ఉత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, స్వామివారు ప్రజలందరినీ సుఖ సంతోషాలతో చూడాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బాబ్జీ, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, ప్రభు, సాయి, మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

అందోల్, మార్చి 17: ఎర్రారంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శేషారెడ్డి ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి, నగదుతోపాటు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆది వారం జోగిపేటలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బాయికాడి శ్రీశైలం నగలుతో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని బంగారం రికవరీ చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

గుమ్మడిదలలో పట్టపగలు చోరీ

గుమ్మడిదల, మార్చి17: మున్సిపాలిటీకి చెందిన పోతరాజు రాము సోమవారం పరిశ్రమలో జనరల్ షిఫ్ట్ 8.30 ఉదయం నుంచి 5.00 వరకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు పట్టపగలు తాళాలు పగలగొట్టి 30 తులాల వెండి గొలుసులు, రూ.45 వేలు చోరీ గురైనట్లు బాధితుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జహీరాబాద్‌లో పన్నులు కట్టని దుకాణాలను సీజ్ చేస్తున్న కమిషనర్ ఉమమహేశ్వర్‌రావు

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

జహీరాబాద్, మార్చి 17: ఇంటి, ఆస్తి, వ్యాపార దుకాణాలకు సంబంధించిన పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమమహేశ్వర్‌రావు కోరారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్ల కోసం పర్యటించారు. నాలుగైదు ఏండ్లుగా పన్నులు చెల్లించని మూడు వ్యాపార దుకాణాలు, ఒక బేకరీని మున్సిపల్ కమిషనర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇంటి, వ్యాపార దుకాణాలకు సంబంధించిన పన్నులు చెల్లించాలని సూచించారు. ఇప్పటివరకు రూ.6 కోట్ల వరకు పన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు నిర్దేశించిన లక్ష్యం మేర పన్నులు వసూలు చేసే దిశగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో అసధికార లేఅవుట్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఎల్ఆర్ఎస్ స్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఈనెల 31వ తేదీలోగా క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన రుసుంలో 25శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని మున్సిపల్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, మార్చి17: ప్యారానగర్ డంపింగ్ యార్డుకో హఠావో-గుమ్మడిదలకో బచావో అంటూ రిలే నిరాహార దీక్షలో ఆందోళనకారులు నినాదించారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే రద్దు చేయాలంటూ మంబాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు, రైతులు, రైతు జేఏసీ నాయకులు 41వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గ్రామస్తులు, మహిళారైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు మూడు చింతల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 41 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్యారానగర్ డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని కోరారు. ఇక్కడి గ్రామాల ప్రజలకు డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. వ్యవసాయం చేసుకుంటే పచ్చగా బతికే రైతులకు నష్టం చేయొద్దని వేడుకున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డును రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు కొత్తపల్లి మల్లేశ్ గౌడ్, భాస్కర్ గౌడ్, ఆంజనేయులు యాదవ్, మంద భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, దయానంద్ పాల్గొన్నారు. అనంతరం డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు శానిటేషన్ డిప్యూటీ కమిసనర్‌కు వినతి పత్రం అందజేశారు.



గుమ్మడిదలలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా 41వ రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న మంబాపూర్ గ్రామస్తులు, రైతులు

బోధన సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణా తరగతులు

గుమ్మడిదల,మార్చి17: గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ పాఠశాలల్లో బోధన సిబ్బందికి హెటిరో డ్రగ్స్ పరిశ్రమ యాజమాన్యం వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహించింది. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి జడ్పీహెచ్ఎస్‌లో బోధన సిబ్బందికి, విద్యార్థులకు పరిశుభ్రతకు సంబంధించిన శిక్షణా తరగతులు నిర్వహించింది. దీనికి మండల విద్యాధికారి రాంబాబు, హెటిరో డ్రగ్స్ హెచ్ఆర్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి , సీఎస్ఆర్ ప్రతినిధులు ఎంఎన్‌బీ రాజు, ఉమామహేశ్వర్‌రెడ్డి, శివరామకృష్ణ, శిక్షకురాలు మల్లేశ్వరి, లక్ష్మి బోధన సిబ్బందికి, విద్యార్థులకు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ నిర్వహణ భాగస్వామ్య పద్ధతుల్లో పరిశుభ్రతకు సంబంధించిన శిక్షణా తరగతులు నిర్వహించారు. పరిశుభ్రతకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య కోసం హెటిరో యాజమాన్యం కృషి చేస్తుందని హెచ్ఆర్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వీరితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

హత్నూర, మార్చి 17: హత్నూర మండలం బోర్పట్ల శివారులోని కంసానికుంట, న్యారెటివాని కుంటను కబ్జా చేయడంతోపాటు గ్రామ పంచాయతీ రోడ్డుపై పుట్‌పాత్ నిర్మించిన అరబిందో ఫార్మా పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం రెండు కుంటలు కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతుందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ రోడ్డును ఆక్రమించి పుట్‌పాత్‌ను నిర్మించిదన్నారు. పలు మార్లు పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కుంటలు కబ్జా చేసిన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోర్పట్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

రాచన్న పటేల్ మృతి పార్టీకి తీరని లోటు

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఝరాసంగం, మార్చి 17: కప్పాడ్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచన్న పటేల్ మృతి పార్టీకి తీరని లోటని డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎస్సీ సహకార అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం అన్నారు. ఆదివారం రాత్రి రాచన్నపటేల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు దవాఖానకు చేరుకొని రాచన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం మాజీ చైర్మన్ నరోత్తం స్థానిక నాయకులతో కలిసి గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. రాచన్న పటేల్ కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారితోపాటు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం, కేతకీ ఆలయ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ సర్పంచులు శంకర్, బస్వరాజ్‌పాటిల్, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్ పటేల్ నివాళులర్పించారు.

కార్పెంటర్ దుకాణంలో అగ్నిప్రమాదం

జహీరాబాద్, మార్చి 17: జహీరాబాద్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాచన్నపేట్ 14వ వార్డులోని గురుకృప కట్టెల మిల్లు సమీపంలోని కార్పెంటర్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. క్రమంగా అవి కార్పెంటర్ దుకాణం మొత్తానికి వ్యాపించడంతో భారీగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. దీంతో కార్పెంటర్ దుకాణంలోని మిషన్లు, సామగ్రి, ద్విచక్రవాహనం కూడా పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్‌ఇంజన్ సహాయంతో మంటల అదుపులోకి వచ్చి కట్టెల మిల్లులో ఘోర ప్రమాదాన్ని తప్పించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని సంబంధిత అధికారులు తెలిపారు. సహాయక చర్యలో మాజీ కౌన్సిలర్ నాము రవికిరణ్, విద్యుత్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సంఘటన వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగిందని కార్పెంటర్ మారుతి తెలిపారు. ప్రభుత్వం బాధితున్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు జహీరాబాద్ పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

ఇంటి వద్దకే తలంబ్రాలు

సంగారెడ్డి, మార్చి 17: వచ్చేనెల 6న జరగనున్న భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలను దేవాదాయ శాఖ సహకారంతో భక్తుల ఇంటి వద్దకే చేరవేస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. తలంబ్రాలను ఈనెల 18 నుంచి వచ్చేనెల 6 వరకు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఒక ప్యాకెట్ ధర రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలోని డిపోల్లో అధికారులను ఏర్పాటు చేసి ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న భూపాల్‌రెడ్డి

ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు

కల్హేర్, మార్చి 17: కల్హేర్ మండలం ఖానాపూర్‌కేలో నిర్వహించిన మల్లికార్జున స్వామి, మేడాలమ్మ, కేతమ్మ కల్యాణ మహోత్సవంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ఆలయంల